ధాన్యం కొనుగోళ్లకు 130 కేంద్రాల ఏర్పాటు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, చిత్రంలో ఉమాహారతి, లింగ్యానాయక్, అధికారులు

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లకు 130 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, వీటిలో 18 కేంద్రాలను సన్న రకం ధాన్యం కొనుగోలుకు కేటాయిస్తామని మిగతావి దొడ్డు రకానికి ఉపయోగించుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై సన్నాహక, శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో సన్నధాన్యం నింపిన సంచులపై ఎర్రదారంతో కుట్టి 'ఎస్' ఆకారంలో అక్షరాన్ని ముద్రించాలన్నారు. దొడ్డు ధాన్యం సంచులను ఆకుపచ్చ దారంతో కుట్టు వేయాలని సూచించారు. సన్న, దొడ్డు రకం రెండూ ఒకే కేంద్రంలో కొనుగోలు చేయటం కుదరదన్నారు. కేంద్ర నిర్వాహకులు నిబంధనలు కచ్చితంగా పాటించి, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, శిక్షణ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీసీఎస్ మోహన్‌బాబు, డీఎంసీఎస్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, డీసీఓ నాగలింగాచారి, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏ కుటుంబాలకు పరిహారం చెల్లించండి

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో మృతి చెందిన వీఆర్ఏ కుటుంబాలకు చెల్లించాల్సిన పరిహారాన్ని వెంటనే అందజేయాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు సీఐటీయూ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆర్. మహిపాల్ మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి వీఆర్ఏ కుటుంబాలకు పరిహారాన్ని చెల్లించటం లేదన్నారు. జీవనాధారం కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో ఎంతో మంది అవస్థలు పడుతున్నారని, ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, నర్సింహులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు మంచి పేరు తెస్తాం



మాట్లాడుతున్న ఎస్. రాజేశ్‌రెడ్డి

వికారాబాద్ కలెక్టరేట్, వికారాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రంథాలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేసి రాష్ట్ర స్థాయిలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఎస్. రాజేశ్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఆయన గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగుల ఖాళీల భర్తీ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. తాండూరు పట్టణంలో రూ.1.35 కోట్లతో గ్రంథాలయ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. బొంరాస్‌పేటలో రూ.64 లక్షలతో గ్రంథాలయ భవనాన్ని నిర్మిస్తామని త్వరలో భూమి పూజ చేస్తామన్నారు. రూ.45 లక్షల వరకు గ్రంథాలయ సెస్ బకాయిలున్నాయని వీటిని చెల్లించేలా సంబంధిత అధికారులను దృష్టికి తీసుకెళతామన్నారు. పాఠకుల కోరిక మేరకు అవసరమైన పుస్తకాలను తెప్పించి మెరుగైన సేవలందిస్తామన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ కార్యదర్శి సురేఖబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల మాధ్యమ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న విద్యాశాఖ కమిషన్ ఛైర్మన్ మురళి

కొడంగల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని పలు పాఠశాలలను పరిశీలించిన అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై సూచనలు అందించారు. జడ్పీహెచ్‌ఎస్ బాలుర, బాలికల పాఠశాలలను పరిశీలించి ప్రతి పాఠశాలలో ఆంగ్ల బోధన ఆచరణలో పెట్టే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణం, తాగునీరు, శౌచాలయాలు, శిథిలావస్థలో ఉన్న వాటి స్థానంలో కొత్తవి నిర్మించేందుకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో విద్యా కమిషన్ సభ్యులు పీఎల్ విశ్వేశ్వరరావు, సి. హెచ్. వెంకటేశ్, కలెక్టర్ ప్రతీక్‌జైన్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవో 29ను రద్దు చేయాలి

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: దళితులకు, గిరిజనులకు అన్యాయం చేసే ప్రభుత్వ ఉత్తర్వు 29ను వెంటనే రద్దు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య అన్నారు. మంగళవారం కేవీపీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జీవో 29తో దళిత, గిరిజన, బలహీన వర్గాల వారు రిజర్వేషన్ పరంగా పొందాల్సిన ఉద్యోగాలను పొందలేరన్నారు.

దశ.. దిశ మారేనా..!

న్యూస్‌టుడే, వికారాబాద్ కలెక్టరేట్, పరిగి:

పదో తరగతి ఫలితాలు ఈసారి ఎలాగైనా ఉన్నతంగా ఉండాలనేది జిల్లా విద్యాధికారుల లక్ష్యం. ఎందుకంటే గత రెండేళ్లుగా పదిలో జిల్లా అట్టడుగు స్థాయిలో నిలిచి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఈ పరిస్థితిని అధిగమించేదుకు ముందుగా డిసెంబర్ నాటికి 100 శాతం సిలబస్ పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. విద్యా సంవత్సరం ఆరంభమై ఇప్పుడే 5 నెలలు దాటింది. ఈ నేపథ్యంలో జిల్లాలో 'పది' విద్యార్థుల సిలబస్ లక్ష్యం ఎంతమేర సాధించారని 'న్యూస్‌టుడే' పరిశీలించగా 50 శాతం కూడా దాటలేదని తేలింది. ఈ పరిస్థితులను అధిగమించడంతోపాటు ఉన్నత ఫలితాలకు ఏంచేస్తున్నారనే దానిపై కథనం.

'పది'లో 40-50 శాతమే సిలబస్ పూర్తి



ఇదీ ప్రణాళిక
- అక్టోబర్ చివరి నాటికి 60 శాతం పూర్తి
- నవంబర్ నుంచి అదనంగా గంట బోధన
- విద్యార్థి అభ్యసన స్థాయి ఎప్పటికప్పుడు పరిశీలన
- డిసెంబరు చివరి నాటికి 100 శాతం లక్ష్యం
- జనవరి నుంచి పునశ్చరణ తరగతుల నిర్వహణ.

జిల్లా విద్యా సమాచారం
- జడ్పీ ఉన్నత పాఠశాలలు: 176
- కేజీబీవీ: 18
- ఆదర్శ: 9
- విద్యార్థులు: 11,820
- ప్రైవేటులో: 1200

అన్నీ సక్రమంగా సాగితేనే..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తగిన బోధన, అభ్యసనాలు సక్రమంగా సాగితే ఫలితాలు మెరుగ్గా వస్తాయి. సిలబస్ పూర్తి చేయడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తప్పకుండా కృషి చేయాల్సి ఉంటుంది. పదో తరగతి విద్యార్థులకు నెలలో ఏ పాఠం ఎంతవరకు పూర్తి కావాలనేది పక్కా ప్రణాళిక ప్రకారం జరగాలి. ఆ తర్వాత విద్యార్థులతో అభ్యసన ఎలా చేయించాలి వంటివి కొనసాగించాలి.

బదిలీలు, పదోన్నతులతో ఆటంకం:

ఈఏడాది ఇప్పటి వరకు అనేక పాఠశాలల్లో 40 నుంచి 50 శాతం మాత్రమే సిలబస్ పూర్తి చేశారు. మారుమూల మండలాల్లోని ఉన్నత పాఠశాలల్లో సిలబస్ సక్రమంగా పూర్తి కాలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఎక్కువ కాలం సాగడం ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. దాదాపు 320 మంది కొత్త ఉపాధ్యాయులు రావడంతో ఆ లోటు భర్తీ చేసేందుకు జిల్లా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం విద్యార్థులకు సమ్మెటివ్-1 పరీక్షలు కొనసాగుతున్నాయి. అనంతరం సిలబస్ వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

గత ఫలితాలను బేరీజు వేసుకుని కార్యాచరణ



పదో తరగతిలో గత సంవత్సరం వచ్చిన ఫలితాలను బేరీజు వేసుకుని మెరుగైన ఫలితాలను సాధించేందుకు గట్టి కృషి చేస్తున్నాం. ఈ విషయంలో ఎక్కడా రాజీపడే పరిస్థితి లేదు. విద్యార్థుల అభ్యసన స్థాయిని ప్రధానంగా పరిగణనలోకి తీసుకుని అదనపు బోధనకు అవసరమైన టైం టేబుల్‌ను రూపొందించాం. పక్కాగా అమలుచేస్తాం.
– రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి, వికారాబాద్

ప్రగతి పనుల పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: చింతామణిపట్నంలో రూ.6లక్షలతో నిర్మించిన సిమెంటు రహదారుల పనులను జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. రహదారులకు కొలతలు చేయించారు. ఎంపీడీఓ విశ్వప్రసాద్, డీఈ నాగభూషణం, ఏఈ నందిని, ఎంపీఓ ఆనంద్‌రావు, కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బషీరాబాద్, న్యూస్‌టుడే: ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సిమెంటు దారులను అదనపు కలెక్టర్ సుధీర్ పరిశీలించారు. పర్వత్‌పల్లి, మైల్వార్, దామర్‌చెడ్, ఎక్మాయి గ్రామాల్లో ఆయన పర్యటించారు. 2023లో ప్రత్యేక అభివృద్ధి నిధులు పంచాయతీకి రూ.50లక్షలు మంజూరైన విషయం తెలిసిందే. సిమెంటు దారులు, మురుగు కాల్వల నిర్మాణం జరిగింది. సంబంధించిన బిల్లులు గుత్తేదారులకు అందలేదు. ఆయా దారులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. తహసీల్దార్ వెంకటేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్ ఉన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న న్యాయవాది శకనప్ప

దుద్యాల, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది బుస్స శకనప్ప అన్నారు. మంగళవారం జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భారత ప్రభుత్వం 2023లో తీసుకువచ్చిన కొత్త చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయ ప్రాధాన్యం తెలుసుకోవాలన్నారు.

ట్యాంకుల్లో క్లోరినేషన్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏఈ అఖిల్

పెద్దేముల్, న్యూస్‌టుడే: గ్రామాల్లోని తాగు నీటి ట్యాంకుల్లో ప్రతి రోజు క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని మిషన్ భగీరథ ఏఈ అఖిల్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ తాగునీటి సహాయకులకు నీటి నాణ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి పదివేల లీటర్ల నీటిలో 40 గ్రాముల బ్లీచింగ్ పౌడర్‌ను కలిపి క్లోరినేషన్ చేయాలన్నారు. ఆర్వో, బోరు నీరు, మిషన్ భగీరథ నీటి మధ్య ఉండే వ్యత్యాసాలపై అవగాహన కల్పించారు. నీటి నాణ్యత పరిశీలనపై వివరించారు. క్లోరినేషన్ చేసిన నీటిని డీటి పద్ధతిలో పరిశీలిస్తే పసుపు రంగు రావాలని చెప్పారు. బ్లీచింగ్ పౌడర్ కలిపిన అరగంట తర్వాత సరఫరా చేయాలని పేర్కొన్నారు.



రహదారే కల్లం.. రైతులు చేతికి వచ్చిన పంటను ఆరబెట్టేందుకు పాత కొడంగల్ రోడ్డును ఆశ్రయిస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. కల్లాలు లేకపోవడంతో ఈ విధంగా చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఉపాధిహామీ పనుల్లో లేదా ఇతర పథకాల కింద రైతులకు కల్లాలు నిర్మించుకునే సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొడంగల్.

దేశ సంక్షేమమే భాజపా లక్ష్యం



సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న రమేష్ కుమార్

పెద్దేముల్, న్యూస్‌టుడే: దేశ ప్రజల సంక్షేమం భాజపా లక్ష్యమని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పరి రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం నాగులపల్లి, పెద్దేముల్, కందనెల్లి గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కందనెల్లి గ్రామంలో ఉమ్మడి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు నారాయణరెడ్డికి సభ్యత్వ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, భద్రేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధ శతాబ్ది వేడుకల విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి గీత

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం అర్ధ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి వై. గీత అన్నారు. మంగళవారం స్థానిక సరస్వతీ జూనియర్ కళాశాలలో ఉత్సవ సన్నాహక సభలో ఆమె మాట్లాడుతూ ఈనెల 24న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో ఈ వేడుకలు జరుగుతాయన్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్సవాలకు జిల్లా నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, మహేందర్, నవీన్ పాల్గొన్నారు.

రోడ్లకు నిధులు.. తీరనున్న ఇక్కట్లు

రూ.227. కోట్లు మంజూరు



తాండూరులో నాలుగు వరుసలుగా మారనున్న రోడ్డు

న్యూస్‌టుడే, తాండూరు: జిల్లాలో రాష్ట్రానికి సరిహద్దుగా కర్ణాటక రాష్ట్రానికి చేరువలో ఉన్న తాండూరు నియోజకవర్గంలోని 135.83 కిలో మీటర్ల అధ్వాన రోడ్లు ఇక మెరుగు పడనున్నాయి. ఇందులో ప్రధాన రోడ్లు 55 కిలో మీటర్లు, గ్రామీణ రోడ్లు 80.83 కి.మీ.గా ఉన్నాయి. ప్రస్తుతం రాకపోకల సమయంలో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్న వాహనదారులు రోడ్లు బాగు పడ్డాక సౌకర్యవంతంగా ప్రయాణాలు సాగిస్తారని అధికారులు పేర్కొంటున్నారు.

సమస్యాత్మకమైనవి గుర్తించి..

నియోజకవర్గంలోని అధ్వాన రహదారులను బాగు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్వయంగా కలిసి కోరారు. ఈమేరకు అధ్వాన రహదారుల బాగు కోసం ప్రభుత్వం ఏకంగా రూ.227.8 కోట్లను మంజూరు చేసింది. వీటి ఆధారంగా సమస్యాత్మకంగా ఉన్న ప్రధాన రోడ్లను బాగు చేసేందుకు అవసరమైన ప్రక్రియ ప్రారంభమైంది. అన్ని నిర్మాణాలు రానున్న రెండు నుంచి మూడు నెలల్లో ప్రారంభమై ఆరేడు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. రహదారులు, భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీర్లు పర్యవేక్షించనున్నారు. ప్రధాన రోడ్లలో తాండూరు-వికారాబాద్, తాండూరుపై వంతెన-కొడంగల్ వైపు వెళ్లే రోడ్లు నాలుగు వరుసల రోడ్లుగా మారనున్నాయి. మిగిలినవన్నీ రెండు వరుసలకు సంబంధించినవే.

చేపట్టే రోడ్డు	నిధుల మంజూరు.. రూ.కోట్లలో	కి.మీ.
తాండూరు-వికారాబాద్	101	39
బషీరాబాద్-కరణ్ కోట	30	12
తాండూరుపై వంతెన-కొడంగల్ వైపు	35	4
గ్రామీణ ప్రాంతాల్లోనివి		
బొంకూరు-రుక్మాపూరు	1.56	1.6
బండమీదిపల్లి-రొంపల్లి	1.77	1.95
రుక్మాపూరు రైల్వే స్టేషన్ వైపు	1.67	200 (మీ)

యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతాం

మంజూరైన నిధుల ఆధారంగా రోడ్ల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన ప్రారంభిస్తాం. ఆరేడు నెలల్లో అన్ని రోడ్లు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం. ప్రస్తుతం అధ్వానంగా మారిన రోడ్ల రాకపోకలు సాగించడంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. రహదారుల నిర్మాణం పూర్తయితే రాకపోకలు సౌకర్యవంతంగా సాగుతాయి.
– ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, తాండూరు.

స్తంభించిన ఈనామ్ సర్వర్ ..నిలిచిన లావాదేవీలు

న్యూస్‌టుడే, తాండూరు: జిల్లాలో జాతీయ వ్యవసాయ విపణి (ఈ-నామ్)కి సంబంధించిన సర్వర్ రెండు రోజుల నుంచి స్తంభించింది. దీంతో రైతులు విక్రయానికి తీసుకువచ్చిన ఉత్పత్తులను వ్యాపారులు కొనుగోలు చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. తాండూరు, వికారాబాద్, పరిగి వ్యవసాయ విపణులు ఈ-నామ్ పరిధిలో ఉన్నాయి. తాండూరు విపణిలో క్రయ,విక్రయాలు రోజువారీగా జరుగుతాయి. వికారాబాద్, పరిగిలో వారాంతంలో ఒకసారి జరుగుతాయి. ప్రస్తుతం వానాకాలంలో సాగు చేసిన సోయాబీన్, పెసర, మినుము, మక్కలు విక్రయానికి వస్తున్నాయి. ఈ-నామ్ పద్ధతిలో విక్రయానికి తీసుకువచ్చిన ఉత్పత్తులకు విపణి అధికారులు గేట్ ఎంట్రీ, లాట్ నంబర్‌ను కేటాయిస్తారు. వ్యాపారులునాణ్యతను పరిశీలించి క్వింటాలు లెక్కన ధరను నిర్ణయిస్తారు. వివరాలను ఆన్‌లైన్‌లోనే నమోదు చేస్తారు. ఎక్కువ ధర చెల్లించే వ్యాపారులకు రైతులు విక్రయిస్తారు. ఇదంతా ఆన్‌లైన్‌లో జరిగే వ్యవహారం. సోమ, మంగళవారం ఈ-నామ్ సర్వర్ నిలిచి పోవడంతో విక్రయాలు పూర్తిగా ఆగిపోయాయి. తాండూరు విపణిలో 500 క్వింటాళ్లకు పైబడిన ఉత్పత్తులు విక్రయం జరగక పేరుకున్నాయి.

సాధారణ పద్ధతిలో బీట్లు నిర్వహిస్తాం

ఈ-నామ్ సర్వర్ సమస్య పరిష్కారం కాకపోతే విపణుల్లో సాధారణ పద్ధతిలో బీట్లు నిర్వహిస్తాం. స్తంభించిన సర్వర్ కారణంగా ఈ-నామ్ పరిధిలో ఉన్న రాష్ట్రంలోని అన్ని విపణుల్లో ఉత్పత్తుల క్రయ విక్రయాలు నిలిచి పోయాయి. తాండూరు, వికారాబాద్, పరిగి విపణుల్లో సర్వర్ పనిచేయడంలేదు. విషయాన్ని ఉన్నతాధికారులు పరిష్కరించే పనిలో ఉన్నారు.
– సారంగపాణి, జిల్లా వ్యవసాయ విపణి అధికారి.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరు



కళాశాల విద్యార్థులతో జిల్లా అధ్యక్షుడు దీపక్ కుమార్

పెద్దేముల్: విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దీపక్ కుమార్ అన్నారు. మంగళవారం పెద్దేముల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో వసతి సౌకర్యాలు సరిగ్గా లేక విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల యూఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా స్వరాజ్, ఉపాధ్యక్షులుగా భాస్కర్, మహిళా అధ్యక్షురాలిగా స్రవంతి, ఉపాధ్యక్షురాలిగా పూజలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమీకృత భవన నిర్మాణానికి భూ సర్వే 25న

దుద్యాల, న్యూస్‌టుడే: మండల సమీకృత భవన నిర్మాణం కోసం ఈనెల 25న సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.వెంకటేశ్‌ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతువేదిక వద్దనున్న స్థలంలో సర్వే చేపడుతున్నామని, అభ్యంతరాలుంటే సంబంధిత పత్రాలతో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

దిష్టి బొమ్మలు కాదు.. పనిచేయని కెమెరాలు



పెద్దేముల్: తాండూర్- జహీరాబాద్ రోడ్డు మార్గంలో గోట్లపల్లి గేటు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. నేరాల నియంత్రణకు వీటిని ఏర్పాటు చేశారు. మరమ్మతుకు గురై నెలలు గడిచినా ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో ఈ గేటు వద్ద ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ప్రధాన రోడ్డు పక్కనే ఆదర్శ పాఠశాల ఉంది. వీటిని దృష్టిలో పెట్టుకొని కెమెరాలను ఏర్పాటు చేశారు. అవి పని చేయకపోవడంతో అలంకార ప్రాయంగా మారాయి.

గ్రాసం కొరత.. రైతన్న వెత

న్యూస్‌టుడే, వికారాబాద్:

- యంత్ర కోతలతో పనికిరాకుండా పోతున్న వైనం
- పశు సంపదపై తీవ్ర ప్రభావం

వ్యవసాయ రంగానికి అనుబంధమైన పశుపోషణ రైతులకు అదనపు ఆదాయాన్ని ఇచ్చే కల్పతరువు లాంటిది. అయితే ఆధునికత, యాంత్రీకరణ పశుపోషణపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. దాదాపు యేటా రూ.25 కోట్ల విలువైన పశుగ్రాసం ఎందుకూ పనికి రాకుండా పోవడమే ఇందుకు ఉదాహరణ.

సంప్రదాయ వ్యవసాయంపై తగ్గుముఖం

కొత్త పుంతలు తొక్కుతూ నాగేటి సాళ్లలో పరుగులు తీస్తున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం సంప్రదాయ వ్యవసాయాన్ని తగ్గించి యంత్ర వినియోగాన్ని పెంచడంతో పోషకులకు ఏటా పశుగ్రాసం కొరత ఎదురవుతోంది. 15 ఏళ్ల క్రితం పశు వైద్య శాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో తెల్లజాతి, నల్లజాతి పశువులు సుమారు 5 లక్షలు ఉండేవి. తాజా పశుగణన ప్రకారం జిల్లాలో తెల్లజాతి, నల్లజాతి కలిపి ఆ సంఖ్య 2,56,502లకు పరిమితమయ్యాయి. కూలీల కొరత, అధిక వ్యయంతో పంటను యంత్రాల సాయంతో నూర్పిళ్లు చేస్తుండటంతో ఉత్పత్తి అయ్యే పశుగ్రాసంలో 80 శాతం వృథా అవుతోంది. దీంతో మేతకు కొరత ఏర్పడి పశువులను కబేళాలకు తరలించడం, సంతలో అయిన మేరకు విక్రయించడం వంటివి చేస్తున్నారు.



యంత్రంతో వరి కోతల నిర్వహణ

కోల్పోతున్న ఆదాయం..

80 శాతం విస్తీర్ణంలో అంటే 1.28 వేల ఎకరాల్లో పంటను యంత్రాల సాయంతో నూర్పిడి చేస్తున్నారు. దీంతో సుమారు 1.8 లక్షల టన్నుల పశుగ్రాసం పనికి రాకుండా పోతోంది. విపణిలో ఒక్క టన్ను పశుగ్రాసం ధర రూ.1,500లు పలుకుతోంది. దీంతో ఒక్క వానాకాలం సీజన్‌లోనే సుమారు రూ.25.2 కోట్ల విలువైన పశుగ్రాసం యంత్రాల వినియోగంతో వృథా అవుతోంది. పంటను కూలీలతో కలిసి నూర్పిళ్లు నిర్వహిస్తే ఒక్క గడ్డిపోచ కూడా వృథా కాకుండా పశుగ్రాసం మొత్తం వినియోగంలోకి వచ్చేది. యంత్ర వినియోగంతో గ్రాసం పనికిరాక ఆదాయాన్ని రైతులు కోల్పోతున్నారు.

ఇదీ జిల్లాలో పరిస్థితి..
- జిల్లాలో ఖరీఫ్ వరి సాగు: 1.36 లక్షల ఎకరాలు
- యంత్రంతో నూర్పిళ్లు: 80 శాతం
- పశుపోషణ రైతులు: 20 శాతం
- పశువుకు రోజుకు కావాల్సిన గ్రాసం: 35 నుంచి 40 కిలోలు
- జిల్లాలో రోజుకు అవసరమయ్యే పశుగ్రాసం: 897 టన్నులు

మార్పులు చేయాలని సూచించాం

యంత్రాల్లో మార్పులు చేసి వృథాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ యంత్ర పరికరాలు రూపొందించే శాస్త్రవేత్తలకు గతంలో జరిగిన పలు సమావేశాల్లో సూచించాం. వరితో పాటు ఇతర పంటల పశుగ్రాసం వృథా పోకుండా పంట నూర్పిడి చేసే యంత్రాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి.

నస్కల్‌ను పురపాలికలో విలీనం చేయొద్దు



పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: నస్కల్ గ్రామాన్ని పరిగి పురపాలికలో విలీనం చేయొద్దని పరిగి మండలంలోని ఆ గ్రామ ప్రజలు మూకుమ్మడిగా డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామంలోని హనుమాన్ మందిర్ పరిసరాల్లో నిల్చుని మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న తమ గ్రామాన్ని ఎప్పటిలా ఉంచాలని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో పరిగిలోని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనకు వినతి పత్రం అందజేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9000766012 9963522257
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008001735

(c) eenadu



నేనేం తప్పు చేశానమ్మా..
నెలల పాటు గర్భంలో
నన్ను మోశావు..
ఈ లోకంలోకి తీసుకొచ్చి అనాథగా
వదిలేశావు..
జన్మనిచ్చిన నిన్ను కళ్లారా చూసుకునే
అవకాశమే ఇవ్వలేదు..
అన్నింటినీ నేర్పించే అమ్మ ఒడిని దూరం చేశావు..
నెలలు నిండకుండానే పుట్టడం నా తప్పు కాదుగా..
అయినా దిక్కులేని వాణ్నిగా వదిలేశావని..
ప్రశ్నిస్తున్నాడు ఈ నవజాత శిశువు. సిద్దిపేట పట్టణంలో
జరిగిన ఈ ఘటన చూపరులను కంటతడి పెట్టించింది.

నెలలు నిండకుండా పుట్టడం నా తప్పా?

నవజాత శిశువును ఊయలలో వదిలెళ్లిన తల్లి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట సర్వజన ఆస్పత్రిలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మగశిశువును వదిలేసి వెళ్లిపోయారు. రోగుల బంధువుల కొంతసేపటికి చూసి వైద్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే శిశువును అత్యవసర చికిత్సకు తరలించారు. నెలలు నిండకుండానే పుట్టడం కేవలం 900 గ్రాముల బరువు మాత్రమే ఉన్నాడని, ఆయాసంతో బాధపడుతున్నాడని.. అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సురేశ్‌బాబు తెలిపారు. పసిబిడ్డకు సీపాప్ ద్వారా చికిత్స అందిస్తున్నామన్నారు. వైద్యులు రాణి, నిఖిత ఆస్పత్రి సిబ్బంది అలియా, ఖాజాబీ బాగోగులు చూస్తున్నారు. వైద్యులిచ్చిన సమాచారంతో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు రాము, రాజారాం వచ్చి పరిశీలించారు. శిశువు ఆరోగ్యం కుదుట పడ్డాక శిశుగృహానికి తరలిస్తామన్నారు.

కాపాడిన 'ఊయల'

కొంతమంది తల్లులు పిల్లలను చెత్తకుండీలు, ముళ్ల పొదల్లో వదిలి వెళ్లిన ఘటనలున్నాయి. ఈ నేపథ్యంలో సిద్దిపేటలో మహిళా, శిశు వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ చేసిన ఓ ఆలోచన పసిప్రాణాన్ని కాపాడింది. చిన్నారులను పెంచలేక పోతే.. ఎక్కడో పారేయకుండా ఆవరణలో ఊయలలో వేయండి.. అని ఆసుపత్రి వద్ద ఫ్లెక్సీ రాసి పెట్టారు. ఇప్పుడే ఆ నవజాత శిశువుకు తల్లి ఒడి అయింది.



పరీక్షిస్తున్న వైద్యుడు

సేంద్రియ సస్యరక్షణపై అవగాహన

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: కంది, శనగ సాగులో సేంద్రియ సస్యరక్షణ చర్యలు మేలని జహీరాబాద్ డీడీఎస్-కృషి విజ్ఞాన కేంద్రం పంటల యాజమాన్య శాస్త్రవేత్త డా. రమేష్ అన్నారు. మండలంలోని ఏంటెలగడ్డ తండా, జీడిగడ్డ తండాల్లో మంగళవారం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. కంది, శనగ పైరుల్లో లింగాకర్షణ బుట్టలు, వేపనూనె కషాయం వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు.



గట్లపై సాగు..

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం శెట్టిపల్లికలాన్‌లో ఎలాబోయిన భూపాల్ పొలంలోని గట్లపై గంజాయి మొక్కలు సాగు చేశాడు. విశ్వసనీయ సమాచారంతో అధికారులు వాటిని స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేశారు.

గంజాయిని.. వేళ్లూనుకోనివ్వద్దు!



సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం మర్వెల్లిలో ఒకరు తన పొలంలో పత్తి, మిరప అంతర పంటగా గంజాయి సాగు చేశారు. విషయం తెలుసుకున్న ఆబ్కారీ పోలీసులు 20 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. న్యాల్‌కల్‌లోనూ ఇలాంటి ఘటన జరిగింది.

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, వెల్దుర్తి, సిద్దిపేట, మెదక్, వికారాబాద్, రామాయంపేట

గంజాయి సాగు.. సరఫరా.. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో నిత్యకృత్యంగా మారింది. ఆబ్కారీ యంత్రాంగం తనిఖీలు చేస్తున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. దొరికితే దొంగ.. లేదంటే రాజా అన్న చందంగా దందా యథేచ్ఛగా సాగుతోంది. ఆరోగ్యానికి హాని చేసే ఈ మత్తుకు యువత, కార్మికులు, విద్యార్థులు ఆకర్షితులవుతూ జీవితాలను పణంగా పెడుతున్నారు. కొన్ని ముఠాలు ఆయా వర్గాల లక్ష్యంగా చేసుకొని పొట్లాలు, చాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. పలు సందర్భాల్లో ఇది రూఢీ అయింది. ఈ తరుణంలో దీని కట్టడే లక్ష్యంగా అడుగేయాల్సిన అవసరం ఉంది.



ప్రమాదంలో బయటపడి..

హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళుతున్న ఓ కారు మెదక్ జిల్లా రామాయంపేట శివారులో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. పోలీసులు దాన్ని గుర్తించి తనిఖీ చేయగా 80 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది.

నాలుగు జిల్లాల్లో గంజాయి కేసులు (జనవరి నుంచి గత సెప్టెంబరు 30 వరకు)

జిల్లా	కేసులు	అరెస్టైంది	స్వాధీనం చేసుకున్న మొక్కలు	దొరికిన ఎండు గంజాయి	విలువ
సంగారెడ్డి	71	108	441	620.16 కిలోలు	రూ. 15,50,4,000
సిద్దిపేట	02	03	26	240 గ్రాములు	రూ. 29,625
మెదక్	14	20	57	1.185 కిలోలు	రూ. 2,60,890
వికారాబాద్	73	148	45	140 కిలోలు	రూ. 6,10,000

నియంత్రణపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో గంజాయి సాగు, ఆక్రమ దందా నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించాం. జిల్లా టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, స్టేషన్ హౌస్ అధికారి ఆధ్వర్యంలో తరచూ తనిఖీలు చేపడుతున్నాం. అదనంగా చెక్‌పోస్టుల ఏర్పాటు, సరిహద్దులో నిఘా ద్వారా కట్టడి చేస్తున్నాం.

– నవీన్ చంద్ర, జిల్లా ఆబ్కారీ శాఖ అధికారి, సంగారెడ్డి

తగ్గి.. మళ్లీ పెరిగి..

2014కు ముందు సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్ నియోజకవర్గంలో అత్యధికంగా గంజాయి సాగు చేసేవారు. అప్పటి ప్రభుత్వం స్వయం ఉపాధి కింద రుణాలు ఇచ్చి రైతులను సాగు మాన్పించేలా చేసింది. మళ్లీ ఇటీవల దీని సాగు పెరిగింది. ఇటీవల నాలుగు జిల్లాల్లోని నారాయణఖేడ్, రాయికోడ్, మునిపల్లి, న్యాల్‌కల్, వెల్దుర్తి తదితర మండలాల్లో ఆబ్కారీ అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. పలువురు పొలం గట్లపై సాగు చేస్తుండటం అందోళనకు గురిచేసే అంశం. సాగుకు విత్తనాలు ఒడిశా, విశాఖ ఏజెన్సీ నుంచి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. సంగారెడ్డి జిల్లాలో 46 మంది రైతులకు ఈ కారణంగానే రైతుబంధు నిలిపివేశారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోనూ గంజాయి సాగు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఏజెన్సీ, ఒడిశా నుంచి జిల్లాల మీదుగా సరఫరా అవుతోంది. ఆ ముఠాలు ఇలా వచ్చిన గంజాయిని పొట్లాలుగా తయారుచేసి పోలీసుల కళ్లుగప్పి రవాణా చేస్తున్నారు.

కొత్త పద్ధతుల్లో..



కూరగాయల వాహనం దిగువన..

నాలుగు జిల్లాల్లో జిన్నారం, ఐడీఏ బొల్లారం, హత్నూర, మనోహరాబాద్, చిన్నశంకరంపేట, చేగుంట, తాండూరు తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో నివసిస్తున్న ఇతర రాష్ట్రాల వారికి పలువురు గంజాయి సరఫరా చేస్తున్నారు. దీన్ని సాగు చేస్తే సులభంగా సరఫరా చేయడంతో పాటు డబ్బులు సంపాదించవచ్చని పలువురు సాగు బాట పట్టారు.

- ఆబ్కారీ, సివిల్ పోలీసులకు అనుమానం రాకుండా వాహనాల్లో అరలు తయారు చేసి అందులో తరలిస్తున్నారు.

చైతన్యం.. అధ్యయనం..

న్యూస్‌టుడే,సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి గ్రామీణ, సదాశివపేట, కంది



శ్రమదానం చేస్తున్న విద్యార్థినులు

వారంతా నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు.. సామాజిక అంశాలపై చైతన్యం తేవడమే లక్ష్యంగా, గ్రామీణ జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు గ్రామాల బాట పట్టారు. అక్కడే ఉంటూ ప్రజలతో మమేకం అయ్యారు. వ్యాధులు, పోషక లోపం, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై పల్లెవాసుల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు. మరోవైపు గ్రామాన్ని శుభ్రం చేశారు. సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులను రైతులకు అవగాహన కల్పించడం విశేషం.

128 మంది విద్యార్థులు..

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 128 మంది విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఈ నెల 16 నుంచి 22 వరకు సంగారెడ్డి మండలం పసల్వాదికి వచ్చారు. అధ్యాపకుల పర్యవేక్షణలో సామాజిక సేవలో పాల్గొన్నారు. రోజువారీగా కార్యక్రమాలు చేపట్టారు.

గ్రామీణ జీవనంపై సర్వే..

గ్రామీణుల జీవనాన్ని తెలుసుకునేందుకు ముందుగా సర్వే చేశారు. ఏ పంట ఎంత మంది పండిస్తున్నారు, రోగాల తీరు, ప్రధాన సమస్యలు, తాగునీటి లభ్యత, తదితర వివరాలపై సర్వే చేశారు. ఆయా వివరాలను సంబంధిత శాఖ అధికారులకు అందజేశారు. స్థానిక చెరువు కర్మాగారాన్ని సందర్శించారు. దిగుబడి, చక్కెర తత్వత్తి తీరు, తదితర అంశాలు తెలుసుకున్నారు.

అవగాహన కార్యక్రమాలు..

భూసార పరీక్షల ప్రాధాన్యాన్ని రైతులకు వివరించారు. రసాయనాల వినియోగంతో కలిగే నష్టాలు, సేంద్రియ ఎరువులతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తుమందు ఇతర వాటితో కలిగే అనర్థాలపై ర్యాలీలు నిర్వహించారు. ఈ మేర అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్ పెంచేలా ప్రోత్సహించారు. వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య కేంద్రాల శాస్త్రవేత్తలతో సూచనలు ఇప్పించారు.

ఎన్నో విషయాలు తెలుసుకున్నా

– ఎస్.అజయ్‌కుమార్, విద్యార్థి



క్షేత్రస్థాయిలో ఎన్నో విషయాలు తెలుసుకున్నా. గ్రామంలో అత్యధికంగా వరి, పత్తి, చెరకు, కూరగాయలు సాగు చేస్తున్నారు. మంజీర నది పరివాహక ప్రాంతం కావడంతో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. ప్రజల జీవనస్థితిగతులు తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడింది.

సంతోషంగా ఉంది

– వి.విష్ణుప్రియ, విద్యార్థిని



సామాజిక సేవలో పాల్గొనడం సంతోషంగా ఉంది. నాలుగేళ్లుగా తరగతి గదులకు పరిమితం అయ్యాం. తొలిసారిగా పల్లెటూరికి వచ్చి ఇక్కడి వారి జీవన స్థితిగతులను తెలుసుకున్నా. పలు అంశాలపై అవగాహన కల్పించాం.



ఐఎస్‌వో ధ్రువపత్రాలను ప్రదర్శిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపక బృందం

సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు

సిద్దిపేట: సిద్దిపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఐఎస్‌వో గుర్తింపును పొందింది. పచ్చదనం, విద్యుత్ పొదుపు, పాలన, వసతులు, ఈ-వ్యర్థాల నిర్వహణ, ఇతర అంశాల ప్రాతిపదికన మూడు ఐఎస్‌వో ధ్రువపత్రాలను మంగళవారం అందుకున్నారు. ఆయా అంశాలపై ఐఎస్‌వో బృందం ప్రత్యక్షంగా తనిఖీ చేసి ప్రదానం చేయడం విశేషం. ప్రిన్సిపల్ జీవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ శ్యామ్, అధ్యాపకులు హర్షం వ్యక్తంచేశారు.

సైక్లింగ్‌లో సత్తా చాటిన అన్నాదమ్ముళ్లు



అందుకున్న పతకాలు, సర్టిఫికెట్లతో అమిత్, సుమిత్

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మల్లంపల్లికి చెందిన అన్న, తమ్ముడు ఇద్దరు సూరంపల్లి అమిత్, సుమిత్ సైక్లింగ్ పోటీల్లో సత్తా చాటారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 8వ రాష్ట్ర స్థాయి ట్రాక్ సైక్లింగ్ పోటీలు గత వారం జరిగాయి. అండర్-16 బాలుర వ్యక్తిగత 5 కి.మీ విభాగంలో అమిత్ విజేతగా నిలిచి బంగారు పతకం, సుమిత్ రెండో స్థానంతో రజత పతకం సాధించినట్లు సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బందారుపల్లి శ్రీనివాసులు, జంగాపల్లి వెంకటనర్సయ్య తెలిపారు. ఇద్దరిని సైక్లింగ్, యోగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మల్లారెడ్డి, మనోహర్, సాయి డైరెక్టర్ చంద్రారెడ్డి, విజయకాంతారావు, కోచ్‌లు విజయభాస్కర్‌రెడ్డి, సంజీవ్ అభినందించారు.

పిల్లల పండగ గోడపత్రిక ఆవిష్కరణ



జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్ పట్టణంలో నవంబర్ 10న 'జహీరాబాద్ పిల్లల పండగ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహణ కన్వీనర్ డా.విజయలక్ష్మి తెలిపారు. పట్టణంలోని గ్రామీణ విజ్ఞాన కేంద్రంలో మంగళవారం పిల్లల పండగ గోడపత్రికను విజ్ఞాన కేంద్రం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. మూడు కేటగిరీల్లో 30కి పైగా ఈవెంట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు రాంచందర్, శివబాబు, మహిపాల్, వెంకటేష్, పూలమ్మ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసుకుని వేదన మిగిల్చి..

ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని యువతి..



అర్చన

జగదేవపూర్: ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం అనంతసాగర్ గ్రామంలో జరిగింది. ఎస్సై జగ్గారెడ్డి తెలిపిన వివరాలు.. దాసరి అర్చన (18) గజ్వేల్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. గ్రామానికి చెందిన యువకుడిని ప్రేమిస్తోంది. విషయం గ్రహించిన తల్లిదండ్రులు మరో సంబంధం వెతికి పెళ్లికి ఒప్పించారు. అర్చన తల్లిదండ్రులు మంగళవారం పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి ఉరి వేసుకుంది. తల్లిదండ్రులు మధ్యాహ్నం ఇంటికొచ్చేసరికి తలుపు పెట్టి ఉంది. స్థానికుల సాయంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఉరికొని మృతి చెంది కనిపించింది. యువతికి తల్లిదండ్రులు, ఇద్దరు అక్కాచెల్లెళ్లు, ఒక సోదరుడు ఉన్నారు. ఈ కుటుంబంలో అర్చన ద్వితీయ సంతానం. తల్లి మల్లమ్మ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

భూమి ఇవ్వలేదని మనస్తాపానికి గురై..

సదాశివపేట: మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తంగెడపల్లిలో రెండు రోజుల కిందట జరిగింది. మంగళవారం వెలుగులోకి వచ్చింది. సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన సిద్ధిపురం రాములు(33)తన వాటాకు చెందిన భూమి ఇవ్వాలని తల్లిదండ్రులను కోరినా ఇవ్వలేదు. బావ, చెల్లెలు కూడా అంగీకరించలేదు. దీంతో మనోవేదనకు గురై గ్రామశివారులో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో పెద్దల సమక్షంలో భూ పంచాయతీ తేల్చేవరకు మృతదేహాన్ని తరలించవద్దని రాములు బావమరిది పట్టుబట్టాడు. దీంతో రెండు రోజులుగా మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచారు. మంగళవారం పెద్దల సమక్షంలో ఒప్పందం కుదరడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యానికి బానిసై యువకుడు..

కల్హేర్, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై కల్హేర్ మండలంలోని మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన నిజాంపేట్ శరత్(30) పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వెంకటేశం తెలిపారు. శరత్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గ్రామంలో మెడికల్ దుకాణం పెడదామని, డబ్బులు ఇవ్వాలంటూ తల్లిదండ్రులను వేధిస్తున్నాడు. గతంలో చేయి కోసుకుని బెదిరించాడు. సోమవారం సాయంత్రం డబ్బుల విషయంలో గొడవపడి డబ్బులు ఇవ్వమని చెప్పడంతో వారు అంగీకరించలేదు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సిద్దిపేట తర్వాత గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం శరత్‌ను నిజాంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్సై వివరించారు. తండ్రి చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

అభినవ.. ద్రోణాచార్య!

ఈనాడు, ఈనాడు డిజిటల్ – అమరావతి: ఒక వినూత్న ఆలోచన.. సమాజం పురోభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు దోహదపడుతుంది. నిత్య జీవితంలో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిస్తోంది. కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానం మనవాళికి ఎంతో ఉపయోగపడుతోంది. భవిష్యత్తులో పలు రంగాల్లో డ్రోన్ టెక్నాలజీ కీలక మార్పులు తీసుకురానుంది. ఇప్పుడిప్పుడే అనేక అవసరాలకు డ్రోన్లు అక్కరకొస్తున్నాయి. ఈ రంగంలో కొత్త ఆవిష్కరణలు, వివిధ అవసరాలకు ఉపయోగపడే డ్రోన్లు, వాటిల్లో నూతన సాంకేతికత, అభివృద్ధిలో



డ్రోన్ల పాత్ర, తదితర అంశాలతో పాటు భవిష్యత్తు మార్గనిర్దేశం పై ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా మంగళగిరిలో 'అమరావతి డ్రోన్ సమ్మిట్' ప్రారంభమైంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు, సందర్శకులు భారీగా పాల్గొన్నారు.

సొంతంగా ఎదగాలనే స్టార్టప్

– పురందర్, ఎంటెక్, ఐఐటీ హైదరాబాద్

నాకు విదేశీ వస్తువులంటే పెద్దగా ఇష్టం ఉండదు. దేశీయంగా తయారు చేయాలనే పట్టుదలతోనే స్టార్టప్ నెలకొల్పాను. నేను అనంతపురం జేఎన్‌టీయూలో బీటెక్ చదివాక హైదరాబాద్ ఐఐటీలో ఐబీ వరే ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశా. ఐఐటీ ప్రాంగణంలో ఉన్న టింకర్ల్యాబ్‌లో ఎక్కువ సమయం గడిపా. అక్కడే సొంతంగా రోబోటిక్ చేయి తయారీకి చాలా కష్టపడ్డా. ఆ ప్రయోగం విఫలమైంది. ఇది నాలో పట్టుదల పెంచింది. డ్రోన్ ప్రాజెక్టుకు 'ఆమని ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు 'ఎక్స్ స్కూల్ పీల్' అనే స్టార్టప్ ఏర్పాటు చేశాను. డ్రోన్ల వేగం నియంత్రణకు ఎలక్ట్రానిక్ స్పీడ్ కంట్రోలర్ (ఇఎస్‌సీ) పరికరాలు సొంతంగా తయారుచేస్తున్నాం. నిపుణుల బృందం సాంకేతిక సహకారంతో ఆర్డర్లు తీసుకుని సరఫరా చేస్తున్నా. వర్ధిష్ణ లాభంలో వారికి వాటా ఇస్తున్నా. భవిష్యత్తులో రోబోటిక్స్‌లో పరిశోధనలపై దృష్టి సారిస్తా. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో బయోడీజిల్ తయారు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా.

పట్టణ ప్రణాళికకు డ్రోన్ సర్వే

న్యూస్‌టుడే, వికారాబాద్ కలెక్టరేట్, పరిగి, తాండూరు

పట్టణ రూపరేఖలు మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగేస్తోంది. ఇందుకు పట్టణ ప్రణాళికను పక్కాగా దీర్ఘ రూపొందించాలని ఆదేశించింది. ఇందుకు సంబంధిత అధికారులు సాధారణంగా అన్ని వార్డులు తిరిగి సర్వే చేపడుతుంటారు. వికారాబాద్ జిల్లాలో మాత్రం కొత్తగా డ్రోన్ ద్వారా సర్వేకు శ్రీకారం చుట్టడం విశేషం. జిల్లాలోని మున్సిపాలిటీ, మండల పురపాలికల్లో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తుండటం విశేషం.



వికారాబాద్ పట్టణంలో సర్వే ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, పుర అధ్యక్షురాలు మంజుల తదితరులు

జిల్లాలో ఇలా

పురపాలిక	జనాభా	వార్డులు
తాండూర్	71,008	38
వికారాబాద్	63,646	34
పరిగి	18,242	15
కొడంగల్	14,519	12

10 రోజుల పాటు..

వికారాబాద్‌లో ఈ నెల 16న కలెక్టర్ ప్రతీక్‌జైన్, పుర అధ్యక్షురాలు మంజుల ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే ప్రారంభించారు. పట్టణంలో ఈనెల 25 వరకు ప్రక్రియ కొనసాగనుంది. ఇందుకు గాను 2 డ్రోన్లు వినియోగిస్తున్నారు. 5 మంది సాంకేతిక, 10 మంది పుర సిబ్బంది రెండు బృందాలుగా విడి విడిగా పాల్గొంటున్నారు. వికారాబాద్ 122 చ.కి.మీ. మేర విస్తరించి ఉంది. కస్తర్లుగా విభజించి

క్రోడీకరించి నివేదిక..

కేంద్రం అమృత్ 2.0 కింద డ్రోన్ కెమెరాలతో సర్వేను ఎంపిక చేసింది. వీటి ద్వారా సేకరించిన సమాచారం, చిత్రాలను క్రోడీకరించి నివేదిక రూపొందిస్తారు. రానున్న 30-40 ఏళ్లలో అభివృద్ధికి తగ్గట్టుగా ప్రణాళిక తయారుచేస్తారు. ప్రస్తుతం ఎన్ని కిందట రూపొందించిన మాస్టర్ ప్లాన్ ఇప్పటికీ కొనసాగుతోంది. పట్టణానికి కొత్త రూపు వచ్చేలా డ్రోన్ సర్వే దోహదపడనుంది. అభివృద్ధితో డ్రోన్ యంత్రం చిత్రాల జీఐఎస్ మ్యాప్ కీలకంగా మారనుంది. ఇప్పటికే వికారాబాద్, పరిగిలో ఈ కొత్త సర్వే మొదలవగా, తాండూరులో 26 నుంచి చేపట్టనున్నారు. 2050 దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నారు.

100 పాయింట్లు నిర్దేశించారు. అక్కడి నుంచి డ్రోన్ సాయంతో దాని పరిధిలోని ప్రాంతాన్ని చిత్రీకరిస్తారు. ఎత్తైన రోడ్లు, ఖాళీ ప్రదేశాలు, నిర్మాణాలు ఎక్కడ ఉన్నాయి, ప్రభుత్వ కార్యాలయాలు, వీధి దీపాలు, పార్కులు, తాగునీటి పైపులైన్లు, నెట్ వర్క్, తాగునీటి రిజర్వాయర్లు, వైశాల్యం, తదితర వాటన్నింటిని సేకరించి బేస్ మ్యాప్ రూపొందిస్తారు.

క్షుణ్నంగా పరిశీలించి.. రాకేశ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి కమిషనర్, వికారాబాద్

పట్టణంలో డ్రోన్ యంత్రాలతో ఈనెల 25 వరకు సర్వే నిర్వహిస్తాం. అన్ని అంశాలను క్షుణ్నంగా పరిశీలించి నివేదిక రూపొందిస్తాం. రానున్న 30 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని దీన్ని తయారుచేయనున్నాం. ఆ మేర అభివృద్ధి చేయాల్సిన తీరుపై విశ్లేషిస్తాం.

రైతులను బలిగొన్న విద్యుత్తు తీగ



విద్యుత్తు తీగ తగిలి మృతిచెందిన శివశంకర్

వట్‌పల్లి, న్యూస్‌టుడే: అడవి పందుల బెడద నుంచి వరి పంటను కాపాడుకునేందుకు వేసిన విద్యుత్తు తీగ యమపాశమై పోతులబొగుడ గ్రామానికి చెందిన రైతు ఎం.శివశంకర్(30)ను బలిగొంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. శివశంకర్ ఖరీఫ్‌లో వరి సాగు చేశారు. అడవి పందుల పంటను ధ్వంసం చేస్తుండటంతో వాటిని నియంత్రించేందుకు పొలం చుట్టూ విద్యుత్తు తీగతో కంచె ఏర్పాటు చేశారు. కాపలా కోసం సోమవారం రాత్రి ఇంటి నుంచి చేనుకు వెళ్లారు. మంగళవారం ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం నడిపించిన వెళ్లాలోమని కుటుంబసభ్యులు భావించారు. సాయంత్రం వరకు రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు చేనుకు వెళ్లి పరిశీలించగా పంట రక్షణ కు వేసిన తీగకు తగిలి విగతజీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. రెండు నెలల కిందట మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

మరమ్మతులు చేస్తూ లైన్‌మెన్..



నవీన్

ఝరాసంగం: నియంత్రిక మరమ్మతులు చేస్తున్న ఓ లైన్‌మెన్ విద్యుదాఘాతంతో మృతి చెందారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం చీల్కేపల్లి గ్రామస్థులు తెలిపిన వివరాలు.. జహీరాబాద్ మండలం చీల్కేపల్లికి చెందిన నవీన్ (34) మాచ్నేపూర్ చీల్కేపల్లిలో లైన్‌మెన్‌గా పని చేస్తున్నారు. మంగళవారం ఉపకేంద్రం నుంచి లైన్‌క్లియర్ తీసుకుని నియంత్రిక వద్ద ఫ్యూజ్ తీగను సరిచేస్తున్నాడు. ఒక్కసారిగా విద్యుత్తు సరఫరా కావడంతో షాక్ కొట్టి కిందపడ్డాడు. తలకు తీవ్రమైన బలంగా తగిలింది. అధికారులు వెంటనే చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి రెండేళ్ల పాప, నాలుగు నెలల బాబు ఉన్నారు. ఎస్సై నరేశ్ వివరాల కోసం ఫిర్యాదు అందలేదన్నారు.

మహిళ ప్రాణం తీసిన విద్యుత్తు కంచె



బుజ్జబాయి

కౌడిపల్లి: పంట రక్షణకు బిగించిన విద్యుత్తు కంచె తగిలి మహిళ దుర్మరణం చెందిన ఘటన కౌడిపల్లి మండలం జాజితండాలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. తండాకు చెందిన కాట్రోత్ బుజ్జిబాయి(38) వ్యవసాయంతో పాటు మేకల పెంపకంతో జీవనం సాగిస్తోంది. మంగళవారం అడవి పందుల రక్షణ కోసం చుట్టూ పెన్సింగ్ వైరుకు విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి తీసుకుండా అలాగే ఉంచారు. విషయం తెలియక పక్కనే మేకలు మేపుతున్న బుజ్జిబాయి.. అవి పొలంలోకి వెళ్లడంతో వాటితో పాటు ఆమె వెళ్లి విద్యుదాఘాతానికి గురైంది. రెండు మేకలతో పాటు బుజ్జిబాయి అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని తరలించి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వారిని ఘటనా స్థలానికి రప్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సై రెండు పోలీసులు నచ్చజెప్పి మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

వాహనం అదుపుతప్పి.. రైతు దుర్మరణం



అశోక్

ములుగు, న్యూస్‌టుడే: ఇంట్లో అత్యగారింటికి వెళ్లిన ఓ రైతు తిరిగివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ ఎస్సై దామోదర్ తెలిపిన వివరాలు.. మర్కుక్ మండలం అచ్చంగారి చెందిన అచ్చంగారి అశోక్ (38), సుసీత దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. దామోదర్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం అత్తగారి ఊరు జగదేవపూర్ మండలం రాయవరం గ్రామానికి శేఖర్ ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అదే రోజుల తిరుగు ప్రయాణం కాగా, అంగడి కిష్టాపూర్ గ్రామ వద్ద వాహనం అదుపు తప్పడంతో స్తంభాన్ని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబీకులు మెరుగైన వైద్యానికి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అశోక్ మృతి చెందాడు. సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

యువకుడి అనుమానాస్పద మృతి



కృష్ణ

నిజాంపేట(రామాయంపేట), న్యూస్‌టుడే: ఇంట్లో నుంచి వెళ్లిన యువకుడు శవమై కనిపించాడు. ఈ ఘటన నిజాంపేట మండలం పరిధి కల్వకుంటలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుంటకు చెందిన ముప్పిగొల్ల కృష్ణ(32) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన కృష్ణ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు మంగళవారం వెతుకుతుండగా గ్రామ శివారులోని చెట్టు కింద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. మృతుడికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య మంజుల, పిల్లలు ఉన్నారు. తల్లి బాలమణి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికెన్ ధరలు			
ఫారం	125-00	డ్రెస్డ్	213-00
రిటైల్	147-00	స్కిన్‌లెస్	243-00

పాతకక్షలతో దాడి.. కేసు నమోదు

కుల్కచర్ల: భూ తగాదాలతో రెండు కుటుంబాలు పరస్పరం దాడులకు పాల్పడిన సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన కుల్కచర్ల మండల పరిధిలోని అంతారంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కావలి రాములు, వేపూరి రామయ్య కుటుంబాల మధ్య భూ తగాదాలు కొనసాగుతున్నాయి. కావలి రాములు తరుపున పలువురు.. వేపూరి రామయ్య ఇంటిపై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో ఇంట్లో ఉన్న చంద్రమౌళి, నారాయణమ్మ, వెంకటయ్య, లావణ్య, శ్రీకాంత్, శరత్‌లకు గాయాలు అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఏడుగురు జూదరులపై కేసు

వికారాబాద్: కొంపల్లి శివారులోని ఓ వ్యవసాయక్షేత్రంలో జూదం ఆడుతున్న ఏడుగురిని ప్రత్యేక కార్యదళం పోలీసులు దాడి చేసి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గర నుంచి రూ.19,250 నగదు, ఓ కారు, 6 సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బీమ్‌కుమార్ తెలిపారు.

యువకుడి అదృశ్యం

పెద్దేముల్: మండల కేంద్రానికి చెందిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్సై గిరి తెలిపిన వివరాలు.. వంశీకిరణ్ సోమవారం మధ్యాహ్నం భోజనం చేసి ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. చీకటి పడిన ఇంటికి రాలేదు. ఫోన్ చేసిన స్పందన కరవైంది. మరుసటి రోజు మంగళవారం తన కొడుకు కనిపించడం లేదని తండ్రి పెద్దేముల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పిడుగుపడి గొర్రెల మృత్యువాత

కుల్కచర్ల: పిడుగుపాటుకు రెండు గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన కుల్కచర్ల మండల పరిధిలోని సాల్వీడ్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. అంజిలయ్య తన గొర్రెలను గ్రామ శివారులో మేపుతుండగా వర్షం వచ్చింది. దీంతో అక్కడే ఉన్న చెట్టు కిందకు వాటిని తీసుకువెళ్లాడు. అదే సమయంలో చెట్టు సమీపంలో పిడుగు పడటంతో రెండు గొర్రెలు మృత్యువాత పడ్డాయి.

వానలతో.. కూర‘గాయాలు’!

న్యూస్‌టుడే, పూడూరు: కొంతకాలంగా కురుస్తున్న వర్షాలతో కూరగాయ పంటలు దెబ్బతింటున్నాయి. ఖరీఫ్‌లో టమాటా, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, పచ్చిమిర్చి, వంకాయ తదితర పైర్లు వేశారు. పంట ఆశాజనకంగా వస్తుండటంతో సకాలంలో సంరక్షణ పనులు ముమ్మరంగా చేపట్టారు. రకాన్ని బట్టి రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి కోసం ఖర్చు చేశారు. తాజాగా కురుస్తున్న వర్షాలతో ఉన్న పంటలకు ప్రస్తుతం తెగుళ్లు వెంటాడుతున్నాయి. ఉద్యాన అధికారులు సకాలంలో స్పందించక పోవడంతో ఏ పంటకు ఏ మందులు వేయాలని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఎవరికి తోచిన విధంగా వారు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో వివిధ గ్రామాల్లో 8వేల ఎకరాలకు పైగానే కూరగాయల సాగు ఉంది.


దెబ్బతిన్న టమాటా పంట

చేజారుతున్న క్యారెట్..

వర్షాధారంపై ఆధారపడే రైతులు జిల్లాలోని నవాబ్‌పేట, మోమిన్‌పేట, పూడూరు మండలంలోని రేగడిమామిడిపల్లి, చన్‌గోముల్, అంగడిచిట్టంపల్లి, కండ్లపల్లి, మేడిపల్లికలాన్ తదితర గ్రామాల్లో ఖరీఫ్‌లో క్యారెట్ పంటను ఎక్కువగా సాగుచేస్తారు. జులై మొదటి వారం నుంచి విత్తనాలు చల్లుతారు. పంట కాలం సమీపిస్తుండటంతో గట్టెక్కుతామనే సమయంలో వర్షాలు వెంటాడుతన్నాయి. ఎదిగిన మొక్కలకు ఎండు తెగులు సోకడంతో పంట నల్లగా మారుతూ.. కాలినట్లు పడిపోతోంది. అనేక ప్రాంతాల్లో ఇప్పటికే సగంపంట దెబ్బతిన్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, వాగునీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న గ్రామాల రైతులకు మరింత నష్టం వాటిల్లుతోంది. పంట ఆశించిన విధంగా దిగుబడి వస్తే నిత్యం రెండు నుంచి మూడు వరకు మినీ వాహనాల దిగుబడి వస్తుంది. క్యారెట్ సాగుతో ఇక్కడి రైతులకే కాకుండా రైతు కూలీలకు రెండు నెలల పాటు కూలీ పనులు దొరికి ఉపాధి లభిస్తుంది ఎక్కువగా మహిళా కూలీలకు లాభం చేకూరుతుంది.

మార్కెట్‌కు అనుకూలం..

కూరగాయ పంటలను తరలించేందుకు హైదరాబాద్ సమీపంలో ఉండటంతో మార్కెట్ సదుపాయం ఉంది. ఖరీఫ్, యాసంగి అన్ని కాలాల్లో ఇక్కడ పండించిన పంటలను నగరంలోని మొజాంజాహీ, కూకట్‌పల్లి, గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి, ఎర్రగడ్డ, మెహదీపట్నం రైతుబజారుకు తరలిస్తారు. కొందరు రైతులు స్థానికంగా వివిధ కార్పొరేట్ సంస్థలకు పొలంలోనే అమ్ముకుంటున్నారు. ప్రధానంగా టమాటా, వంకాయ, పచ్చిమిర్చి ఇతర కూరగాయలతో పాటు కొత్తిమీర, గోంగూర, మెంతి, పూదిన, పాలకూర తదితర ఆకుకూరలను అధికంగా పండిస్తారు.

ఏం చేయాలో తోచక రైతుల కష్టాలు

పరిశీలించి నమోదు చేస్తాం

– వైజయంతి, ఉద్యానాధికారిణి, పరిగి డివిజన్

ఇటీవల వరుసగా కురిసిన వర్షాలతో ఖరీఫ్‌లో సాగు చేసిన వివిధ కూరగాయ పంటలపై తీవ్ర ప్రభావం పడుతోంది. సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా కురుస్తుండటంతో చాలాచోట్ల పంట పొలాల్లోకి నీరుచేరింది. పదును అధికమై ఉద్యాన పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లుతోంది. దీంతో వివిధ రకాల తెగుళ్లు సోకుతున్నాయి. వ్యవసాయశాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలోకి వెళ్లి పంటలను పరిశీలిస్తాం, రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తాం.


పాడవుతున్న బీరతోట

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, దోమ, తాండూరు టౌన్, మోమిన్‌పేట: పరిగి గ్రామీణ, పూడూరు:

? పాలేపల్లి అలుగుపారి కాలువ సమీపంలోని సాగు భూములు కోతకు గురవుతున్నాయి. అలుగు కాలువ నిర్మించండి.
– రామయ్య, రైతు పాలేపల్లి.

✓ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరైతే నిర్మించి పరిష్కారానికి కృషి చేస్తాం. **– సిద్దార్థ, ఏఈ దోమ**

? తాండూరు ఇందిరమ్మ కాలనీలోని వీధుల్లో మురుగు కాల్వలు పూర్తిగా శుభ్రం చేయటం లేదు. **–రాము, తాండూరు.**

✓ పూర్తిగా శుభ్రం చేయటానికి చర్యలు తీసుకుంటాం.
– విక్రమ సింహారెడ్డి, పురపాలక సంఘం కమిషనరు తాండూరు.

? చంద్రశేఖర్‌నగర్ కాలనీలోని వీధులలో కొన్ని నెలలుగా వీధి దీపాలు వెలుగక కాలనీవాసులు రాత్రి వేళలో అవస్థలు పడుతున్నారు. **– రాజు, చంద్రశేఖర్ కాలనీ, మోమిన్‌పేట.**

✓ కాలనీలో దీపాలు వెలుగని చోట్లను గుర్తించి ఏర్పాటు చేయిస్తాం. **– స్వప్న, కార్యదర్శి.**

? మా గ్రామంలో వేదిక పరిసరాల్లో వ్యవసాయ అవసరాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ బుడ్డీల కింద సామర్థ్యానికి మించి కనెక్షన్‌లు ఉన్నందున రైతులకు సరఫరాలో లోవొల్టేజీ సమస్య తలెత్తుతోంది. దీంతో సుమారు 20 మంది రైతుల బోర్లు నడవక అవస్థలు పడుతున్నాం. **–కుర్వ ప్రవీణ్‌కుమార్, వెంకటయ్య, మహ్మద్, మొరంగపల్లి రాజు రైతులు, నస్కల్ గ్రామం, పరిగి మండలం.**

✓ నియంత్రిక నుంచి వాడుతున్న వ్యవసాయ బోరు కనెక్షన్ల లోడు వేసి పరిశీలిస్తాం. కొత్తగా రెండు నియంత్రికలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపి వెంటనే నియంత్రికలను ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. **–ఖాజాబాబు, ఏఈ విద్యుత్తు శాఖ, పరిగి**

? గ్రామంలోని మంచినీటి సరఫరా ట్యాంకు వద్ద అపరిశుభ్రత నెలకొంది. క్రిమికీటకాలతో భయపడాల్సి వస్తుంది. **– సాబేర్, మేడికొండ**

✓ పరిశీలించి పారిశుద్ధ్య కార్మికులతో వెంటనే పనులు చేయించి సమస్య రాకుండా చూస్తాం. **– మమత, పంచాయతీ కార్యదర్శి.**

కాటేస్తున్న.. కరెంటు కంచెలు!

● అడవి పందుల నుంచి రక్షణకు రైతుల ఏర్పాట్లు
● విద్యుదాఘాతంతో మృతి చెందుతున్న పల్లెవాసులు

“ పరిగి మండలం రంగంపల్లికి చెందిన బాలరాజు, తల్లి పార్వతమ్మ, అన్న రాములు ఈ నెల 19న సీతాఫలాలు అమ్ముకుని.. నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నారు. దారిలో వేరుశనగ పంట రక్షణ కోసం రైతు ఏర్పాటు చేసిన విద్యుత్తు కంచెకు బాలరాజు కాలు తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తల్లి, అన్న ఇద్దరు ఉన్నా.. రాములును కాపాడుకోలేకపోయారు.”

- పల్లెల్లో విద్యుత్తు కంచెలు రైతులు, స్థానికుల ప్రాణాలను తీస్తుందనడానికి ఇవి ఒక ఉదాహరణ మాత్రమే. విద్యుత్తు కంచెలతో అడవి పందులేమో కానీ స్థానికులు మృత్యువాత పడుతున్నారు.

న్యూస్‌టుడే, బొంరాస్‌పేట

వికారాబాద్ జిల్లాలో యాసంగిలో రైతులు వేరుశనగ పంటతో పాటు మొక్కజొన్న తదితర పంటలను సాగు చేస్తుంటారు. వాటిపై అడవిపందులు దాడిచేసి నాశనం చేస్తుంటాయి. వాటిని నుంచి పంట రక్షణకు కంచె ఏర్పాటు చేస్తున్నారు. కానీ అవి వేసినట్లు తెలియక పక్క పొలాలకు చెందిన రైతులు, ఇతరులు వాటికి తగిలి పిట్టల్లా రాలిపోతున్నారు. ఒక్కోసారి ఏమరుపాటు వల్ల కంచె ఏర్పాటు చేసినట్లు తెలియక పొలం యజమానులే దాని బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. మనుషులే కాదు.. పశువులు కూడా ప్రాణాలు వదిలి సంఘటనలున్నాయి. వేరుశనగ పంటను పండించే సీజన్‌లోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతుంటాయి. ముఖ్యంగా రాత్రిపూట పొలాలకు వెళ్లిన రైతులు వీటిని గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.


అడవి పందుల నుంచి రక్షణ కోసం వేరుశనగ పంట చుట్టూ వేసిన కంచె

ఈ జాగ్రత్తలు తీసుకోండి

● పొలం చుట్టూ విద్యుత్తు కంచెల కంటే సోలార్ కంచెలను ఏర్పాటు చేసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చు. వీటిని ఏర్పాటు చేయడం వల్ల మనిషికి తగిలినా ప్రాణం పోదు.

● కంచెకు కరెంటు కనెక్షన్ ఇచ్చిన పొలం యజమానులు ఉదయం కనెక్షన్ తొలగించడం మరిచిపోతుంటారు. దీంతో పక్క పొలాల రైతులు దీనిని గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. తొలగిస్తే ప్రమాదాలు కొంతైనా నివారించవచ్చు.

● రాత్రిపూట పొలాలకు వెళ్లే రైతులు టార్చిలైటు సహాయంతో కంచెలు ఉన్నాయా? లేవా? అని జాగ్రతగా పరిశీలించాలి.

మరమ్మతుల వేళ..

వ్యవసాయ బోరు మోటార్లు పని చేయనప్పుడు, బోరుకు విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు రైతులు సరఫరా నిలిపివేకుండా తామే మరమ్మతులు చేస్తున్నారు. ఇలాంటి అజాగ్రత్తల వల్ల కూడా విద్యుదాఘాతాలు సంభవించి రైతులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈదరు గాలులతో కూడిన వర్షాలు కురిసి పొలాల్లో తెగి తెగిపడుతుంటాయి. వాటిని గమనించక రైతులు, ఆయా యకులు చనిపోతున్నారు.

కంచెలు ఏర్పాటు చేయరాదు

– నాగరాజు, ట్రాన్స్‌కో ఏఈ, బొంరాస్‌పేట

అడవి పందుల రక్షణ కోసమని రైతులు పొలాల చుట్టూ విద్యుత్తు కంచెలు ఏర్పాటు చేయరాదు. వీటివల్ల రైతులు చనిపోతున్నారు. ఈ విషయంపై అందరికీ తెలిసేలా.. అన్ని గ్రామాల్లో చాటింపు చేసి ప్రజలకు తెలియజేస్తాం.

నారసింహుని బ్రహ్మోత్సవాలు


శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో..

పరిగి: పట్టణంలోని శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తుల రాకపోకల కోసం ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు యాగశాల ప్రవేశం తదితర కార్యక్రమాలు వేద పండితుల మధ్య జరిగాయి. ఉత్సవాల్లో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ అశోక్‌కుమార్, ఆలయ ధర్మకర్త ఎదిరె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనాథ ఉత్సవాలు..

పూడూరు, న్యూస్‌టుడే: పెద్దఉమ్మెంతాల్‌లో వెలసిన తిరుమలనాథస్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజున మంగళవారం మధ్యాహ్నం ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు జరిగాయి. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ పీఠాధిపతి శ్రీ వెంకటదాసు మార్గదర్శకంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి.

చెక్కుల పంపిణీ

పరిగి గ్రామీణ: సీఎం సహాయ నిధులతో బడుగులకు కష్టకాలంలో ఎంతో చేయూత అందుతోందని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డా.టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో వైద్యచికిత్సలు పొందిన మండల పరిధిలోని బర్కత్‌పల్లి గ్రామానికి చెందిన బి.సౌందర్యకు మంగళవారం రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.

వృథాగా మరుగుదొడ్లు

తుంకిమెట్ల సమీపంలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై వాహనదారుల కోసం నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామానికి అర కిలోమీటరు దూరంలో రహదారి పక్కన లారీలు, ట్రక్కులు నిలపడానికి రోడ్డును విశాలంగా నిర్మించారు. వాహనాల డ్రైవర్లు వినియోగించుకోవడానికి వీలుగా రోడ్డుకు ఇరువైపులా మరుగుదొడ్లను నిర్మించారు. కానీ ఎప్పుడూ తాళాలు వేసే కనిపిస్తాయి. అధికారులు వినియోగంలోకి తేవాలని వాహనదారులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, బొంరాస్‌పేట



నీటి సరఫరాలో సహాయకులే కీలకం: ఎంపీడీవో


మాట్లాడుతున్న పరిగి ఎండీవో కరీం

పరిగి: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా విషయంలో సహాయకులే కీలకమని మండల అభివృద్ధి అధికారి కరీం, గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం డివిజన్ డీఈఈ సుబ్రహ్మణ్యం అన్నారు. సహాయకులకు జరుగుతున్న శిక్షణ సమావేశంలో మంగళవారం పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పూడూరు, పరిగి మండలాల గ్రిడ్ ఏఈ విపుల్ వివిధ గ్రామాలకు చెందిన మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

రహదారికి నిధుల మంజూరుపై హర్షం


క్షీరాభిషేకాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరణ్‌కోట(తాండూరుగ్రామీణ), న్యూస్‌టుడే: కరణ్‌కోట-జీవన్గికి రెండు వరుసల తారు రహదారి నిర్మాణానికి రూ.30కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిల చిత్రపటాలకు కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు కరణ్‌కోటలో మంగళవారం క్షీరాభిషేకాలు చేశారు. పన్నెండు కి.మీ. రహదారితో ప్రయాణం సులభమవుతుందన్నారు.

పోటీ పరీక్షలకు పుస్తకాల పంపిణీ

బొంరాస్‌పేట: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ కోసం పోటీ పడే విద్యార్థులకు ‘యూత్ ఫర్ సేవా సంస్థ’ సహకారంతో పుస్తకాలను టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ బొంరాస్‌పేటలో విద్యార్థులకు పంపిణీ చేశారు. పోటీ పరీక్షల్లో విద్యార్థులు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు గోపాల్, అనిల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెయింటర్ల నూతన కార్యవర్గం

పరిగి, న్యూస్‌టుడే: ఫ్రెండ్స్ యూత్ పెయింటర్స్ అసోసియేషన్ నియోజకవర్గ స్థాయి నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం బాల్‌రాజ్ అధ్యక్షతన జరిగాయి. అధ్యక్షుడిగా సునీల్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా యాదయ్య, కార్యదర్శిగా జంగయ్య తదితరులు ఎన్నికయ్యారు.

పాఠశాలల బలోపేతానికి సహకారం అవసరం

కుల్కచర్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరి సహకారం అవసరమని భాజపా నాయకులు అంజిలయ్య అన్నారు. కుల్కచర్ల మండలం ఘణాపూర్‌లో పాఠశాల విద్యార్థులకు స్థానికులు వెంకటయ్యగౌడ్‌తో కలసి ప్లేట్లు, గ్లాసులను అందించారు.

పల్లెల్లో భారీ వర్షం

పెద్దేముల్: గ్రామాల్లో మంగళవారం వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించింది. మండల కేంద్రంలో వర్షం రాకతో సంతలో రైతులు, వ్యాపారులు అవస్థలు పడ్డారు.

ఘనంగా కొమురం భీం జయంతి

పరిగి: గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో కొమురం భీం జయంతి వేడుకలు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంఘ జిల్లా నాయకులు ఆనంద్, బాలకృష్ణ, అంబర్‌సింగ్, అనిల్‌నాయక్, రామునాయక్, లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ భూమి కోసం, ముక్తి కోసం ‘జల్ జంగల్ జమీన్’ అనే నినాదంతో పోరాటం చేశారని ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

దాడి ఘటనలో పరస్పర ఫిర్యాదులు

బషీరాబాద్: పరస్పరం దాడులు చేసుకొన్న వారిపై కేసు నమోదు చేసినట్లు బషీరాబాద్ ఎస్సై గఫార్ తెలిపారు. కొర్విచేడ్‌కు చెందిన శేఖర్, శ్రీనివాస్, వెంకటప్ప, నర్సింహులు సోమవారం రాత్రి చర్చి వద్ద కలుసుకున్నారు. మాటామాట పెరిగి ఒకరికొకరు తిట్టుకుంటూ రెండు వర్గాలుగా విడిపోయి కొట్టుకొని గాయపర్చుకున్నారు. పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. వారిపై కేసు నమోదైంది.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయండి

శంషాబాద్: సిద్ధాంతి హనుమాన్ దేవాలయ భూముల్లో ఇష్టారాజ్యంగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని శంషాబాద్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు జి.అరవింద్ కుమార్ కోరారు. ఆయన మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావుకు వినతి పత్రం అందజేశారు.

గ్రామాల్లో నేడు ఎమ్మెల్యే పర్యటన

బషీరాబాద్, న్యూస్‌టుడే: బషీరాబాద్ మండలం మైల్వార్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పర్యటించనున్నారని, బస్ షెల్టర్‌కు శంకుస్థాపన చేస్తారని గ్రామ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

యాలాల: నేడు యాలాల మండలంలోని హాజీపూర్ గ్రామంలో ఎమ్మెల్యే బుయ్యని ఆత్మీయసమ్మేళనంలో పాల్గొంటారని ప్రజాభవన్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. మధ్యాహ్నం 2గంటలకు మాజీ సర్పంచి ఒంగోనిబాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యేతో కలిసి కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పెద్దఉమ్మెంతాల్‌లో గీతాయజ్ఞం..

పూడూరు, న్యూస్‌టుడే: పెద్దఉమ్మెంతాల్‌లోని తిరుమలనాథస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సామూహిక గీతాయజ్ఞం ఉంటుందని నిర్వహకులు తెలిపారు. ఎల్లకొండకు చెందిన రామకృష్ణశర్మ మార్గదర్శకంలో ఉదయం 10:30 గంటలకు పూజలు ప్రారంభం అవుతాయన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

శంషాబాద్: అధ్యాపకులు అంకితభావంతో విధులు నిర్వహిస్తే విద్యార్థుల ప్రతిభ బయటకు వస్తుందని శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హిమబిందు పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం పాఠ్యాంశాలను బోధిస్తున్న నరసింహ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ సాధించారు. మంగళవారం ఆయన్ను డిగ్రీ కళాశాలలో అధ్యాపకులతో కలిసి ప్రిన్సిపల్ శాలువాలతో సత్కరించి అభినందించారు.

EENADU eClassifieds

JOBS

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. ✆ 7995984445.

BANKING/ INSURANCE

Require Agents, P/F Time, Pan India No.1 Life Insurance Company. Earn Upto 1 Lakh P/M. Qual: 10th & Above. Ph: 9951049888

TOURS AND TRAVELS

రామేశ్వరం, కన్యాకుమారి, మధురై, కంచి 10,500/- 8 రో॥ 25-11 * కాశీ, ప్రయాగ, అయోధ్య, నైమిశారణ్యం 12,500/- 9 రో॥ 1-12 అన్ని టూర్స్ మా స్వంత భోజనం & రూమ్స్ సత్యసాయి. 9618933189.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

పెద్దేముల్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని తాండూరు గ్రామీణ సీఐ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం నాగులపల్లి గ్రామంలో కెమెరాల ఏర్పాటుపై ప్రజలతో మాట్లాడారు. వాటి ఏర్పాటుతో నేరాలు నియంత్రించ వచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై గిరి, మాజీ సర్పంచి బస్వరాజ్, శ్రీనివాస్, బసంత్‌రెడ్డి, శేఖర్, పురుషోత్తం, నాగిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాములు పాల్గొన్నారు.

చుక్కల మందు పంపిణీ

తాండూరుగ్రామీణ: ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్, ధన్వంతరి ఆయుర్వేద చికిత్సాలయం, వరదశ్రీ ఫౌండేషన్ సహకారంతో గ్రామీణ ప్రజలకు ఉచితంగా కంటి చుక్కల మందు పంపిణీ చేయడం అభినందనీయమని సాయిపుత్ర సంస్థ అధ్యక్షుడు శంకర్ యాదవ్ అన్నారు. జినగుర్తిలోని ఏకలవ్య సేంద్రియ కళాశాల ప్రాంగణంలోని కంటి చుక్కల మందు శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. సంస్థ ప్రతినిధులు మనోహర్‌యాదవ్, రాజ్‌కుమార్, పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు జొన్నలవినోద్, పురుషోత్తంరెడ్డి, మాజీ సర్పంచి కేశవ్ బంటుమల్లప్ప, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు మంజూరు చేయండి

వికారాబాద్ కలెక్టరేట్: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి యాదవ్, పీడీఎస్‌యూ నాయకులు నరసింహ, జనార్దన్, రవీందర్ కోరారు. జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను కలిసి వినతి పత్రం అందించారు.

వైద్యశిబిరాలతో పేదలకు మేలు

పెద్దేముల్, న్యూస్‌టుడే: ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజల ఎంతో మేలు కలుగుతుందని తాండూర్ నియోజకవర్గం కాంగ్రెస్ అధ్యక్షుడు లొంక నర్సింలు అన్నారు. మంగళవారం కొండాపూర్ గ్రామంలో ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి మదనంతపూర్ రేగొండి, నెల్లిగడ్డతండా గ్రామాల ప్రజలు హాజరయ్యారు. మహావీర్ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ నాయకుడు బోయిని మహేష్, రాములు, ఇసాక్, రూప్‌సింగ్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు

మోమిన్‌పేట: రోగాలు రాకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని వైద్య శిబిరం సమన్వయ కర్త జంగా జయరాజు గ్రామస్థులకు సూచించారు. వెల్చాల్‌లో ఆశ్రయం ‘హ్యాండ్ ఆఫ్ హోప్ ట్రస్ట్’ హైదరాబాద్ వారు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

46 గ్రామాల్లో కరెంటు కోత..

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: తాండూరు మండలం గ్రామాల్లో మంగళవారం విద్యుత్తు అంతరాయం ఏర్పడి వినియోగదారులు ఇబ్బందులుపడ్డారు. ఉదయం 7గంటలకు 46 గ్రామాల్లో సరఫరా నిలిచిపోయింది. దీంతో తాగునీటి పథకాలు పనిచేయక పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు అసౌకర్యానికి గురయ్యారు. నాపరాయి పరిశ్రమల్లో కార్యకలాపాలు స్తంభించి వందలాది మంది కార్మికుల ఉపాధి, ఆదాయంపై ప్రభావం పడింది. ఉదయం 11 గంటలకు సరఫరాను పునరుద్ధరించారు. ముందస్తు సమాచారం లేకుండా నాలుగు గంటలపాటు సరఫరా నిలిచిపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రయాణికులకు ఎంత కష్టం!

పల్లెల్లో బస్‌షెల్టర్లు లేక పాట్లు

న్యూస్‌టుడే, దుద్యాల, కొడంగల్ గ్రామీణం: వర్షాకాలం, ఎండాకాలంలో ప్రయాణికులు తలదాచుకునేందుకు బస్‌షెల్టర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించినవి శిథిలావస్థకు చేరి సగం మేర కూలి వృథాగా మారిపోయాయి. దీంతో నిత్యం రాకపోకలు కొనసాగించే ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. ఆర్టీసీకి ఉన్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నిధులు కేటాయించక బస్‌షెల్టర్లు నిర్మించేందుకు ముందుకు రావడం లేదు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు ముందుకు రావాల్సి ఉంది. ‘కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ’ (కడా) ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ బస్‌షెల్టర్ల ఏర్పాటుకు నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారో అని పల్లెల ప్రయాణికులు ఆశతో ఎదురు చూస్తున్నారు.


లగచర్ల స్టేజీ దగ్గర బస్‌షెల్టర్ దుస్థితి

మచ్చుకు కొన్ని...

● లగచర్ల స్టేజీ దగ్గర కొన్నేళ్ల క్రితం నిర్మించిన ప్రయాణికుల ప్రాంగణం శిథిలావస్థకు చేరి పైకప్పు కూలి పోయింది. దాని చుట్టూ పొదలు పెరిగి వృథాగా మారిపోయింది. ● దుద్యాల స్టేజీ దగ్గర నిర్మించినది సైతం సగం మేర కూలిపోయి ఎటూ పనికి రాకుండా పోయింది.

● మూడు ప్రధాన రోడ్లు కలిసే సాగారం తండా దగ్గర ప్రయాణికులకు షెల్టర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

● ఈర్లపల్లి నుంచి సంత్రకుంట తండాకు వెళ్లే రెండు వరుసల ప్రధాన రోడ్డు, చిల్ముల్‌మైలారం, నాజ్‌ఖాన్‌పల్లి దగ్గర కూడా నిర్మాణాలు లేవు.

‘కడా’లో ఫిర్యాదు చేయాలి

- సురేష్‌కుమార్, డీఎం, తాండూరు

ఈ బస్‌షెల్టర్‌లు లేని విషయమై కడా కార్యాలయంలో ఫిర్యాదు చేయాలి. అక్కడి నుంచి నిధులు మంజూరైతే ఎక్కడెక్కడ అవసరమో పరిశీలించి వీటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. మా పరిధిలో ఉన్న బస్టాండ్‌లను మాత్రమే అభివృద్ధి చేసుకుంటున్నాం. వీటి ఏర్పాటుకు ప్రభుత్వంతోపాటు గ్రామ పంచాయతీలు, పురపాలికలు చూసుకోవాలి.

నల్ల బ్యాడ్జీలతో టీచర్ల నిరసన


బొంరాస్‌పేటలో నిరసన తెలుపుతున్న టీచర్లు

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న టీచర్ల సమస్యల సాధనకు తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో టీచర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం బొంరాస్‌పేట ఉన్నత పాఠశాల ఆవరణలో నిరసన తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మండల అధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

తాండూరుగ్రామీణ: నిరసన కార్యక్రమాల్లో మండలాధ్యక్షుడు రవికుమార్, ఆనంద్, నర్సప్ప, జైపాల్‌రెడ్డి, మాణిక్‌రావు, అంజిలయ్య, సరస్వతి, విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్: తట్టెపల్లి, ఇందూరు, పెద్దేముల్, ఉన్నత పాఠశాలల్లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు రాజేష్, సంతోష్, గాజుల బస్వరాజ్ వడిచర్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపిన వారిలో.. సంఘ బాధ్యులు గాజుల వీరేశం, రవికుమార్, కవిత, శోభ, అనిల్‌కుమార్, శ్రీనివాస్, గీత, నర్సింహులు, హరీష్, సేవ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu